
కొండమీద తట్టల కుంభకోణం

152 తట్ట లైసెన్సుల పునరుద్ధరణ, స్థల మార్పిడులకు అనుమతి

పాతిక కోట్లు చేతులు మారినట్టు ప్రచారం

ప్రపంచంలోనే సంపన్నదేవుడైన శ్రీనివాసుడు కొలువైన తిరుమల కొండ అధికార నేతలకు బంగారు బాతులా మారింది. మరీ ఎన్నికల వేళ ఖర్చుల కోసం అందినకాడికి దండుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా తట్ట లైసెన్సుల పునరుద్ధరణ, స్థల మార్పిడి పేరుతో కోట్ల రూపాయలు వెనకేసుకున్నారనే విమర్శలు జోరుగా సాగుతున్నాయి. గత నెల 26న జరిగిన టీటీడీ పాలక మండలి సమావేశంలో నిర్ణయం తీసేసుకున్నా, ఇప్పటికీ బయటకు వెల్లడించకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుమలలో 152 తట్ట లైసెన్సులు పునరుద్ధరించడానికి, ఒక చోట నుంచి మరోచోటకు తరలించడానికి అనుమతిస్తూ టీటీడీ బోర్డు సమావేశం పచ్చజెండా ఊపేసిందని సమాచారం. వీటిలో వంద దాకా అధికార పార్టీకి కావాల్సిన వారివే అంటున్నారు. అయినవారికి మేళ్లు చేయడం, అందినకాడికి వసూలు చేసుకోవడం అనే పద్ధతిలో తట్టల పందారం సాగిందంటున్నారు. తట్ట లైసెన్సు కోసం ఒక్కొక్కరి నుంచి రూ.15లక్షల దాకా వసూలు చేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయం మీడియాలో గగ్గోలు కాకుండా మీడియాకు సంబంధించిన కొందరికి కూడా తట్టలు కట్టబెట్టినట్లు చెప్పుకుంటున్నారు. అనధికారికంగా తట్టలు నడుపుకుంటున్న వారికి లైసెన్సులివ్వడం, తట్ట లైసెన్సులు కొనుగోలు చేసిన వారి పేరు మీద పునరుద్ధరించడం, ప్రస్తుతం ఉన్న తావు నుంచి వ్యాపారం మరింత బాగా జరిగే ప్రదేశాలకు తట్టను మార్చుకోవడానికి అనుమతించడం వంటివి జరిగాయి.

7 షాపులూ మార్చేశారు

తిరుమలలో ఏడు షాపులను ఒక చోట నుంచి మరో చోటకు తరలించడానికి కూడా ఇటీవలి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వీటిలో హోటళ్లే ఎక్కువగా ఉన్నాయి. ఈ తరలింపు అనుమతుల కోసం దుకాణదారులు రూ.5కోట్ల వరకూ ముడుపులు చెల్లించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. కొండపైన పీఏసీ 1, పీఏసీ 2, సీఆర్వో, హెచ్‌టీ తదితర ప్రాంతాల్లో దుకాణదారులకు ముఖ్యంగా హోటళ్ల నిర్వాహకులకు వ్యాపారాలు తగ్గాయి. ఆ ప్రాంతాల్లో టీటీడీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసినందున భక్తుల్లో ఎక్కువ మంది అక్కడే టిఫిన్లు, భోజనాలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాల నుంచి నందకం, వకుళమాత భవనం, మ్యూజియం, మఠాలు, వరాహస్వామి గెస్ట్ హౌస్ ఎదుట శ్రీవారి సేవా సదన్ తదితర ప్రాంతాలకు తమ హోటళ్లను తరలించుకునేందుకు యత్నిస్తున్నారు. ఆప్రాంతాల్లో హోటళ్లు లేకపోగా ఇటీవల కాలం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. బోర్డు నిర్ణయం వీరికి కల్పతరువుగా మారింది. ఇలా తరలింపునకు అనుమతి పొందిన ఓ హోటల్ యజమాని తిరుపతి మంచాల వీధికి చెందిన అధికార పార్టీ నాయకుడు కావడం విశేషం. అందులోనూ అతడిది టెండర్ ద్వారా దక్కిన షాపు. నిబంధనల మేరకు మరో ప్రాంతానికి తరలించడానికి అవకాశం లేదు. అయినా తరలింపునకు అనుమతి దక్కిందని సమాచారం. మరొకరు హెచ్‌టీ కాంప్లెక్స్ నుంచి మ్యూజియం వద్దకు షాపును మార్చుకునేందుకు అనుమతి పొందారని తెలుస్తోంది.

ఒకప్పుడు తట్టంటే..?

ఒకప్పుడు తిరుమల కొండ మీద కొందరు దేవుడి దారాలు, చిన్న చిన్న బొమ్మలు, టోపీలు, కలకండ, తినుబండారాలు వంటివి తట్టలో పెట్టుకుని అమ్మేవారు. తట్టను నెత్తిన కానీ, పొట్టకి ఆనించుకుని మెడకు వేలాడదీసుకునిగానీ భక్తులుండే ప్రాంతాలకు తిరుగుతూ అమ్ముకుని పొట్టపోసుకునేవారు. భక్తుల సంఖ్య భారీగా పెరిగాక తట్టల వ్యాపారాలు రోజూ వేలల్లో జరగడం మొదలైంది. దీంతో తట్ట వ్యాపారుల మధ్య గొడవలు కూడా జరిగేవి. దీన్ని గ్రహించిన టీటీడీ 1975 నుంచి తట్టలకు లైసెన్సులు ఇవ్వడం మొదలుపెట్టింది. ప్రారంభంలో పదుల సంఖ్యలోనే ఉండే ఈ లైసెన్సు తట్టల సంఖ్య పెరుగుతూ పోయింది. తిరుమల నుంచి స్థానికుల తరలించడంతో వీరికి న్యాయం చేయడానికి కూడా తట్ట లైసెన్సులు ఇచ్చారు. మొదట్లో లైసెన్సు కాలపరిమితి పదేళ్ల నుంచి 20 ఏళ్ల దాకా ఇచ్చేవారు. ఇప్పుడు ఏటా రెన్యువల్ చేసుకోవాలనే నిబంధన పెట్టారు. మొదట్లో ఒక తట్ట నుంచి నెల అద్దె రూ.300లు టీటీడీ వసూలు చేసేది. ఆ తర్వాత దాన్ని వెయ్యికి పెంచారు.ప్రస్తుతం రూ.3000లు వసూ లు చేస్తున్నారు. నిర్ణీత గడువులోగా తట్ట రెన్యువల్ చేసుకోకపోతే రద్దు చేయాలి. అయితే ఇప్పుడు దీన్నే మానవీయ కారణం చూపుతూ రెన్యువల్ చేస్తున్నారు. నిజానికి ఎప్పుడెప్పుడో ఆగిపోయిన తట్టలను కూడా కొందరు ఎప్పుడో కొనేశామంటూ అగ్రిమెంట్లు చూపించి ఇలా కొత్త అనుమతులు పొందారు.

ఇప్పుడు తట్టంటే ఇదీ..

నెత్తిన తట్ట ఎప్పుడో మాయమైంది. ఆ స్థానంలో చిన్న దుకాణాలు వెలిశాయి. పేరు తట్టే గానీ టీ బంకులుగా, టిఫిన్ సెంటర్లుగా, వివిధ వస్తువులమ్మే షాపులుగా ఇవి రూపం మార్చుకున్నాయి. ప్రస్తుతం తిరుమలలో అధికారికంగా తట్టలు 800 దాకా ఉన్నాయి. అనధికారికంగా మరో 500 నడుస్తుంటాయి. అధికారుల మౌఖిక హామీలతో వీటిని అయినవాళ్లు నడుపుకుంటూ ఉంటారు. నిజానికి వీళ్లు తట్ట పెట్టుకోరు. అద్దెకిచ్చి రోజుకి వేల రూపాయిలు వసూలు చేసుకుంటూ ఉంటారు. ఇలా మీడియాకు సంబంధించిన అనేకమందికి కూడా అనధికార తట్టలు లెక్కకు మిక్కిలి కొండ మీద ఉన్నాయి. బోర్డు నిర్ణయంతో ఈ అయినవాళ్లందరి పంట పండింది. భవిష్యత్తులో ఎవరు అధికారంలోకి వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు అధికారిక ఆమోద ముద్ర వేసేసుకుంటున్నారు. నెలకు లక్షల్లో అద్దె వచ్చే తట్ట కోసం పది నుంచి పదహైదు లక్షలు ముట్టజెప్పడం పెద్ద భారంగా ఎవ్వరూ అనుకోవడం లేదు.

తట్టకి అద్దె రోజుకి రూ.10 వేలు

తిరుమలలో ఒక తట్ట లైసెన్సు ఉంటే చాలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కూడా వదిలేసుకోవచ్చు. తట్ట లైసెన్సు ఉన్నవారే వ్యాపారం నడుపుకోనవసరం లేదు. అద్దెకిచ్చినా చాలు. పీఏసీ-1 వద్ద తట్ట లైసెన్సు కలిగిన వారు ఇతరులకు ఇస్తే రోజుకి రూ.1,500లు అద్దె వస్తుంది. ఇదే తట్టను పాత అన్నదాన సత్రం సమీపానికి మార్చుకోగలిగితే అద్దె రోజుకి రూ.10వేలు లభిస్తుంది. దీంతో వ్యాపారం బాగా జరిగే తావుకి తట్టలు మార్చుకోవడానికి జరిగిన ప్రయత్నాలు అధికార పార్టీ నాయకుల పాలిట వరంగా మారాయి. ఈ విధంగా పాపవినాశనం నుంచి పీఏసీ-1 ప్రాంతానికి గతంలోనే తరలించుకున్న ఒకరు, ఇప్పుడు అక్కడ వ్యాపారం సరిగా లేదన్న కారణంతో పాత అన్నదాన సత్రం వద్దకు మార్చుకున్నారని చెబుతున్నారు. మరొకరు పాపనాశనం నుంచి నేరుగా పాత అన్నదాన సత్రం వద్దకు మార్చుకున్నారని,ఇంకొకరు షాపింగ్ కాంప్లెక్స్ నుంచి పాత అన్నదాన సత్రం వద్దకు తట్టను తరలించుకున్నట్టు సమాచారం. కాగా ఇదే పాత అన్నదాన సత్రం వద్ద తట్టల వ్యాపారం వల్ల యాత్రికులకు అసౌకర్యంగా ఉందని గతంలో 30 తట్టలను ఇక్కడి నుంచి తొలగించడం విశేషం.

ముక్కంటి క్షేత్రానికి కల్యాణ శోభ




ఆది దంపతుల వివాహ వేడుకకు ముస్తాబైన పెండ్లి మండపం

శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువజామున ఆదిదంపతుల కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకోసం శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లి మండపాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. మరోవైపు ఆదివారం సాయంత్రం నుంచే క్షేత్రానికి కల్యాణ శోభ సంతరించుకుంది. కల్యాణోత్సవ ఘడియల్లో పెళ్లి చేసుకోవడానికి పలు జంటలు తరలివచ్చాయి. ఈ క్రమంలో బాల్య వివాహాలు జరక్కుండా అధికారులు నిఘా పెట్టారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ముక్కంటీశుడిని గజవాహనంపై, జ్ఞాన ప్రసూనాంబదేవిని సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఊరేగింపుగా పెండ్లి మండపం వద్దకు బయల్దేరారు. వేకువన 3.30 గంటలకు కల్యాణోత్సవం జరపనున్నారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

● దాదాపు 25 అంశాలపై చర్చించనున్న సభ్యులు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం తిరుమలలో జరుగనుంది. బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో సభ్యులు దాదాపు 25 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి, తీర్మానాలు చేయనున్నారు. ఆలయంలోని సన్నిధితీర్థ పీఠం, కొలువు పీఠాలపై బంగారు తాపడంతో రాగి రేకులను ఏర్పాటు చేసే అంశంతోపాటు వసతి గృహాలు, పీఏసీ-1 మరమ్మతులు, ముడి సరుకుల కొనుగోళ్లు, బాలాజీనగర్ సమీపంలో సుమారు రూ.1.5 కోట్లతో ఫెన్సింగ్ ఏర్పాటుపై చర్చించనున్నట్టు సమాచారం. అలాగే రూ.14 కోట్లతో తిరుమలలోని ఉద్యోగుల క్వార్టర్స్ మరమ్మతులు,వివిధ జాతీయ బ్యాంకుల్లో బంగారు నిల్వలు, వాటిపై వచ్చే వడ్డీ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు,ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది. కాగా, ఎన్నికల కోడ్ సమీపిస్తున్న క్రమంలో ఇదే టీటీడీ చివరి బోర్డు సమావేశమనే చర్చ నడుస్తోంది.



సిద్ధం సభకు మరో 85 బస్సులు

తీవ్రంగా ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

తిరుపతి అర్బన్, మార్చి 10: వైసీపీ ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న సిద్ధం సభకు ఇప్పటికే 155 ఆర్టీసీ బస్సులను తీసుకెళ్లారు. చంద్రగిరి నియోజకవర్గానికి బస్సులు చాలడం లేదని వైసీపీ నాయకుడు కోరగా.. శనివారం అర్ధరాత్రి మరో 85 బస్సులను అధికారులు తరలించేశారు. తిరుపతి, తిరుమల, అలిపిరి, మంగళం, పుత్తూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి డిపోల నుంచి నిష్పత్తి ప్రకారం బస్సులను ఎంపిక చేసి పంపారు. మరోవైపు డ్రైవర్లకు స్పెషల్ డ్యూటీ వేస్తే కొందరు నిరాకరించగా, బలవంతంగా ఒప్పించినట్లు సమాచారం. దీనివల్ల ఆదివారం ఉదయం నుంచే చాలా ప్రాంతాలకు బస్సుల కొరత కనిపించింది. గంటల తరబడి నిరీక్షిస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.





హైవేపై వాహనాలు అపుతున్న పోలీసులు - మాంబట్టు సెజ్‌లో నిలివేసిన వాహనాలు

300 కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ ఆంక్షలు

సూళ్లూరుపేటలో భారీ వాహనాలు ఆపేసిన పోలీసులు

సూళ్లూరుపేట, మార్చి 10: బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగే సిద్ధం సభ కోసం 300 కిలోమీటర్ల దూరంలోని సూళ్లూరుపేటలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 10గంటల నుంచే నెల్లూరు వైపు వెళ్లే భారీ వాహనాలను హైవేలోని సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద, తడ మండలం కొండూరు సమీపంలో అపాచి క్రాస్ రోడ్డు వద్ద సీఐ మధుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆపేశారు. వీటిని మాంబట్టు సెజ్‌లో ఉన్న ఖాళీ స్థలాల్లోకి మళ్లించారు. సీఎం సభ జరుగుతుందని, సాయంత్రం వరకు ఇక్కడే ఉండాలని హుకుం జారీ చేశారు. హైవేపై తాము వెళుతుంటే ట్రాఫిక్ ఇబ్బంది ఏంటని వాహనాల డ్రైవర్లు లబోదిబోమన్నా ఫలితం లేకపోయింది. దీనివల్ల డ్రైవర్లు, క్లీనర్లకు తాగునీరు, మధ్యాహ్నం భోజనం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మగ బిడ్డను పెంచుకోవాలనే ఎత్తుకొచ్చేశా

● కిడ్నాపర్ ఇజ్జాడ దేవి

తిరుపతి, క్రైం మార్చి 10: 'నాకు ఆడబిడ్డ ఉంది. మగబిడ్డను పెంచుకోవాలనే తిరుమల నుంచి ఎత్తుకొచ్చేశా' అని నిందితురాలు ఇజ్జాడ దేవి మీడియాకు చెప్పింది. బాలుడిని తిరుపతికి తీసుకొచ్చి లాడ్జిలో ఉండగా పోలీసులు తనను పట్టుకున్నారని పేర్కొంది. ఈ బాలుడిని మరో వ్యక్తికి అప్పగించడానికి ఫోన్ ద్వారా ఆమె ప్రయత్నించింది. అతను రావడం ఆలస్యం కావడంతోనే పోలీసులకు చిక్కింది.



బిడ్డను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తల్లి ఒడికి చిన్నారి చేరిందిలా..

పోలీసులు అప్రమత్తమవ్వడంతో కొద్ది గంటల వ్యవధిలోనే కిడ్నాప్ గురైన అభినయ్ (3) తల్లి ఒడికి చేరాడు. తిరుపతిలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మీడియాకు వివరాలను తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ఐజ గ్రామానికి చెందిన నగేష్, పరిమళ దంపతులు తమ ఇద్దరు కుమారులు అక్షయ్ (6), అభినయ్(3), కుటుంబీకులతో కలిసి శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తిరుమలకు వచ్చారు. గది లభించక పోవడంతో పీఏసీ-2లో సేదతీరారు. ఆ సమయంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన ఇజ్జాడ దేవి తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో అభినయ్‌ని ఆడిస్తూ అక్కడి నుంచి ఎత్తుకొచ్చేసింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో బిడ్డ కనిపించడం లేదని గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు బిడ్డను తిరుమల నుంచి దేవి.. ఓ జీపులో తిరుపతికి తీసుకొచ్చేసింది. కెన్సెస్ నుంచి సంధ్య థియేటర్ రోడ్డులోకి వెళ్లి అక్కడున్న ఆర్టీసీ ఉద్యోగుల రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ యాదవ్‌ను అద్దె గది కావాలని అడిగింది. పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటాయని చెప్పడంతో అటువైపు వెళ్లింది. కొంతసేపటికి ఆర్టీసీ డిపో మేనేజర్ ద్వారా వాట్సప్‌లో కిడ్నాప్ వివరాలు చూసిన ప్రభాకర్ వెంటనే ఈ విషయాన్ని సీఐ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన.. ఈస్ట్, తిరుమల టూటౌన్ పోలీసులతో కలిసి పెద్దకాపు లేఅవుట్‌లోని లాడ్జీలలో గాలించి నిందితురాలిని, బిడ్డను గుర్తించారు. రాత్రి సుమారు ఎనిమిది గంటలకు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. బిడ్డను తల్లిదండ్రులకు ఎస్పీ అప్పగించారు. స్వల్ప వ్యవధిలోనే కిడ్నాప్ కేసును ఛేదించిన సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని, తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ బృందం, తిరుమల వన్‌టౌన్ కానిస్టేబుల్ కె.మునిశేఖర్‌తోపాటు ఆర్టీసీ నేత ప్రభాకర్ యాదవ్‌ను ఎస్పీ అభినందించారు.



నిందితురాలు దేవి



ఎలా ఉన్నారు?

● ఎన్టీఆర్ రాజుకు నందమూరి కుమారుడి పరామర్శ

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వీరాభిమాని అయిన ఎన్టీఆర్ రాజు(రామచంద్రరాజు)ను తన కుమార్తె రూపతో కలిసి నందమూరి మోహన్‌కృష్ణ పరామర్శించారు. తారకరత్న వర్థంతి సందర్భంగా శనివారం తిరుమలకు వచ్చిన వీరు ఆదివారం స్థానికుడైన రాజును కలిశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను పరామర్శించి, పాతరోజులను గుర్తుచేసుకున్నారు. త్వరలోనే ఆరోగ్యం కుదుటపడుతుందని ధైర్యం చెప్పారు. వీరివెంట ఫిలిమ్ చాంబర్ సెక్రటరీ ప్రసన్నకుమార్, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులున్నారు.

నేటినుంచి నాగాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చంద్రగిరి, మార్చి 10: చంద్రగిరి సమీపం జాతీయ రహదారిలో వెలసిన నాగాలమ్మ ఆలయ ఆవరణలో సోమవారం నుంచి బుధవారం వరకు గణపతి, సుబ్రమణ్యంస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. నాగాలమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నూతనంగా గణపతి, సుబ్రమణ్యంస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ఆలయ ధర్మకర్త ఒంటి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు పొంగళ్లు పెట్టడానికి, భక్తులు సేద తీరడానికి ఏర్పాట్లు చేశారు.

ముక్కోటిలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



రావణాసుర వాహనంపై శివపార్వతులు

చంద్రగిరి, మార్చి 10: తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం ఉదయం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లీదేవికి అభిషేకం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు పార్వతీపరమేశ్వర్ల ఉత్సవర్లను అలంకరించి రావణాసుర వాహనంపై అధిష్ఠించి, ఆలయ ప్రదక్షిణగా ఊరేగించారు. 9 గంటలకు కాలభైరవస్వామికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం 7 గంటలకు స్వామివారికి శయనోత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



పాకాల, మార్చి 10: పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1964 సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం అయ్యారు. స్థానిక రామకృష్ణ మందిరంలో 60 ఏళ్ల తర్వాత కలిసి ఉల్లాసంగా గడిపారు. ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, అబ్దుల్, ఎంఎస్ రెడ్డి, ఆనంద రెడ్డి, సోమశేఖర్, చెంగల్రాయ నాయుడు, వెంకట్రామానాయుడు, శ్రీనివాస్, భాస్కర్, గులాబ్‌జాన్, చంద్రశేఖర్ నాయుడు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే జరిమానా

పాకాల, మార్చి 10: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకుంటే జరిమానా తప్పదని సీఐ రాజగోపాల్ హెచ్చరించారు. రైల్వేస్టేషన్ ఎదుట మూడు రోడ్ల కూడలి వద్ద ఆదివారం ఆయన వాహనాల తనిఖీ చేశారు.

'సూపర్ సిక్స్' పథకాలతో రాష్ట్రాభివృద్ధి

భాకరాపేట, మార్చి 10: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందని పులివర్తి వినీల్ అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా ఆదివారం ఆయన చిన్నగొట్టిగల్లులో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆర్వీ రమణారెడ్డి, మునస్వామినాయుడు, విజయశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనను బలోపేతం చేద్దాం



జనసైనికులతో దేవర మనోహర

భాకరాపేట, మార్చి 10: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని చంద్రగిరి జనసేన ఇన్‌చార్జి దేవర మనోహర అన్నారు. ఆదివారం జనసేన ఆధ్వర్యంలో భాకరాపేట నుంచి చిన్నగొట్టిగల్లు వరకు స్కూటర్ ర్యాలీ, ఎడంవారిపల్లెలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు కొమ్మిశెట్టి రూపేష్, వినోద్, విజయ్, ప్రకాశ్, కుమార్, బద్రి, హరినాథ్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రామచంద్రాపురం, మార్చి 10: మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఆదివారం రామచంద్రాపురం మండలంలోని చుట్టుగుంట, రామాపురంలో ప్రచారం నిర్వహించారు. రేణుకాదేవి, తేజోవతి, కుసుమ, జాహ్నవి, వర్షిత తదితరులు పాల్గొన్నారు.

మరకత శక్తి అమ్మవారి సేవలో టీటీడీ ఈవో



అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న టీటీడీ ఈవో

రామచంద్రాపురం, మార్చి 10: రాయలచెరువు కట్ట శ్రీశక్తిపీఠంలోని మరకత శక్తి కాళీ అమ్మవారిని టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందర భారతిస్వామిని, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు.

నేడు రామచంద్రాపురం మండల సమావేశం

రామచంద్రాపురం, మార్చి 10: ఆర్‌సీపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

శిల్పారామంలో స్టాల్స్ సముదాయం ప్రారంభం



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న సీఈవో శ్యామ్‌సుందర్‌రెడ్డి

తిరుచానూరు, మార్చి 10: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం నూతనంగా హస్తకళాకారుల కోసం రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన 22 స్టాల్స్‌ను శిల్పారామం రాష్ట్ర సీఈవో శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో 17 దుకాణాలను ఎస్సీ, బీసీ హస్తకళాకారులకు కేటాయించారు. సుందరీకరణ పనుల్లో భాగంగా రాజస్థాన్‌నుంచి ప్రత్యేకంగా తెప్పించిన గాజిబోను ప్రారంభించారు. దీన్ని రూ.18లక్షల వ్యయంతో తయారు చేశారు. ఉద్యానవన అభివృద్ధిలో భాగంగా రూ.23లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పనులను ప్రారంభించి సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏవో ఖాదర్‌వలీ, రాధాకృష్ణ, బాలిరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, రమణ, వెంకటరెడ్డి, నాని, పప్పీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా ఇసుకను తోడేస్తున్నారు..!

● వేదాంతపురంలో వైసీపీనేత అండతో రెచ్చిపోతున్న మాఫియా



వేదాంతపురంలో బాయమ్మతోట వద్ద ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఇసుక

తిరుపతి(రూరల్), మార్చి 10: తిరుపతి రూరల్ మండలంలో వేదాంతపురం లెక్కదాఖలోని స్వర్ణముఖినదీ పరివాహక ప్రాంతంలో అనధికారంగా ఇసుకను తోడేస్తున్నారు. పంచాయతీకి చెందిన వైసీపీ ముఖ్యనేత అండతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక నింపుకుని అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌ని అక్కడికే తీసుకొచ్చి ఇసుక తీసుకుంటే ఒకరేటు లేదా అవసరం ఉన్నచోటుకు వారు చేర్చితే మరో రేటును వసూలు చేస్తున్నారని తెలిసింది. అధికారపార్టీ ముఖ్య నేత కావడంతో ప్రశ్నించేందుకు గ్రామస్తులు ఎవరూ సాహసం చేయడం లేదు. దీనిలో ప్రధానంగా బాయమ్మతోటలోని హ్యాపీ హోమ్స్ పాట్లు ఉన్న ప్రైవేట్ భూమిలో మామిడిచెట్లను తొలగించి దాదాపు 30 అడుగుల లోతువరకు ఇసుకను తవ్వేసి అమ్ముకుంటున్నారు. నాలుగైదు నెలలుగా ఇష్టారాజ్యంగా రేయింబవళ్లు ఇసుక తోడేసి అనధికారంగా విక్రయిస్తున్నా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఈబీ) అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సర్వేనెంబరు 251లో హ్యాపీహోమ్స్ వేసిన వెంచర్ స్వర్ణముఖీ నదీ పరివాహక ప్రాంతానికి సమీపంలో ఉండడంతో రిజిస్ట్రేషన్లను పెండింగ్‌లో పెట్టి ఉన్నారు. ఇదే అదనుగా స్థానిక వైసీపీ ముఖ్యనేత రంగప్రవేశం చేసి దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో మామిడిచెట్లను తొలగించి.. అక్కడ ఉన్న ఇసుకభూమిని ప్రైవేట్ వ్యక్తులకు సెంట్లచొప్పున బిట్లుబిట్లుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఈ భూమిని కొనుగోళ్లు చేసిన ప్రైవేట్ వ్యక్తులు టెండర్ పాలసీకి తూట్లు పొడిచి.. రోజూ కూలీలతో ట్రాక్టర్లలో ఇసుక నింపుకుని బయటప్రాంతాల్లో అధికరేట్లకి విక్రయిస్తున్నారు. ఐదునెలలుగా ఈ భూమిలో దాదాపు రూ.రెండుకోట్ల వరకు ఇసుక వ్యాపారం చేశారని స్థానికులు అంటున్నారు. అలాగే స్వర్ణముఖినది పరీవాహక ప్రాంతంలో కూడా అనధికారికంగా ఇసుక తవ్వి.. విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఆరేళ్ల తర్వాత చంద్రగిరి కోటలో లైటింగ్ షో



● తిలకించిన ఆర్కియాలజీ, ఏపీ టూరిజం అధికారులు

చంద్రగిరి, మార్చి10: చంద్రగిరి కోటలో ఆరేళ్ల తర్వాత లైటింగ్ షోను పునఃప్రారంభించడానికి అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం పురావస్తుశాఖ సూపరింటెండెంట్ గోపినాథ్ జన్నా, ఆర్కియాలజీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దేవేంద్రనాథ్‌బోయే, ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, లక్స్ అండ్ డిజిబుల్ సంస్థ ఇంజనీర్ శివపిళ్ళై, సీఈవో రవి తదితరులు చంద్రగిరి కోటను సందర్శించారు. రాత్రి లైటింగ్ షోను తిలకించారు. 2018లో జూలైలో భారీ వర్షాలతో కోటలో రాజు గోపురంపై పిడుగు పడింది. దీంతో లైటింగ్ షో మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి లైటింగ్ షో లేకుండా పోయింది. ఇటీవల ప్రభుత్వం లక్స్ అండ్ డిజిబుల్ సంస్థతో కొన్ని ఒప్పందాలు చేసుకుని మళ్లీ పర్యాటకుల కోసం లైటింగ్ షోను ప్రదర్శించడానికి సిద్ధమైంది. మరమ్మతులు పూర్తిచేశారు. ఈ క్రమంలో లైటింగ్ షోను త్వరలో పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సీఏ ప్రవీణ్‌కుమార్, లైటింగ్ షో అసిస్టెంట్ మేనేజర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



కోట వద్ద ఆర్కియాలజీ, ఏపీ టూరిజం అధికారులు

రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీయేలో చేరిక

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న పలువురు

తిరుచానూరు, మార్చి 10: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయే కూటమిలో చేరాయని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని తెలిపారు. ఆదివారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన తిరుపతి రూరల్ మండలం యోగిమల్లవరంలో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసీపీ అన్యాయాలు, నియంతృత్వ పోకడలతో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు యోగిమల్లవరానికి చెందిన వైసీపీ నేత పెరుమాళ్, ఎంపీటీసీ మహేశ్వరి తెలిపినట్లు చెప్పారు. తనపై నమ్మకంతో టీడీపీలో చేరిన పెరుమాళ్, మహేశ్వరి వారి అనుచరులకు కృతజ్ఞతలు తెలిపారు. తుమ్మలగుంటలో పేదల కోసం పోరాటం చేస్తున్న తన సతీమణిపై పోలీసులు దాడికి పాల్పడ్డారన్నారు. ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యుల ఆదేశాలతో సీఐలు ఈ దాడికి పాల్పడ్డారన్నారు. చంద్రగిరిలో చెవిరెడ్డి కుటుంబ పాలలను సాగనంపాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, సాల్మన్‌రాజ్, కిషోర్‌రెడ్డి, జీవన్, వాసు, మునిరత్నంరెడ్డి, నాగూర్, సాయిరాయల్, ఖలీం, శివ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన వంద కుటుంబాలు

పులివర్తి నాని ఆధ్వర్యంలో తనపల్లె క్రాస్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పాడిపేట పంచాయతీ పాడిపేట గ్రామం, హరిజనవాడ, గోవిందపురానికి చెందిన వంద వైసీపీ సానుభూతి కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

జాగా కనిపిస్తే వేసేయ్ పాగా..!

● కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమికి ఎసరు



తిరుచానూరు మల్లంగుంట ప్రాంతంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి

తిరుచానూరు, మార్చి 10: తిరుచానూరు పరిసర ప్రాంతాల్లో ఆక్రమణదారులు ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ పాగా వేసేస్తున్నారు. స్థలాల విలువ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కొద్దిపాటి జాగా కనిపిస్తే చాలు అక్కడ వాలిపోతున్నారు. మొదట తాత్కాలిక కట్టడాలు ప్రారంభించి.. షెడ్లు వేసి తర్వాత కబ్జాకు పాల్పడుతున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు రంగ ప్రవేశం చేసేసరికి యుద్ధప్రతిపాదికన నిర్మాణాలు జరిగిపోతున్నాయి. తిరుచానూరు ముఖద్వారం మల్లంగుంట వద్ద గతంలో తుడా ఛైర్మన్‌గా పనిచేసిన ఎన్వీ ప్రసాద్ 265/3 సర్వేనెంబరు స్థలాన్ని బస్టాండ్‌కు కేటాయించారు. ప్రభుత్వాలు మారడంతో అది అమలుకు నోచుకోలేదు. గత ఏడాది కూడా ఇక్కడ సుమారు మూడెకరాలకుపైగా స్థలాన్ని ఆక్రమించడానికి యత్నించారు. దీనిపై కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా అని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు రంగప్రవేశం చేసి కూల్చివేశారు. ఈ భూమిలో ఆదివారం గుట్టు చప్పుడు కాకుండా తిరుపతికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడి పేరుతో కొంతమంది తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ యంత్రాంగం ఎన్నికల పనుల్లో ఉండటంతో అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నారు. అలాగే సర్వే నెంబరు 234 తుడా లీజుకు ఇచ్చిన ప్రాంతంలో కూడా ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఆక్రమణలను వెంటనే రెవెన్యూ అధికారులు అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

తుమ్మలగుంట చెరువు కనుమరుగు

● దుర్వినియోగమైన రూ.150కోట్లను ఎమ్మెల్యేనే ఇవ్వాలి ● ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న బడి సుధా యాదవ్


తిరుపతి(రూరల్), మార్చి 10: తిరుపతి రూరల్ మండలంలోని తుమ్మలగుంట చెరువును సుందరీకరణ పనుల పేరిట కనుమరుగు చేశారని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్, పుదిపట్ల సర్పంచ్ బడి సుధాయాదవ్ విమర్శించారు. చెరువులో కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ చేపట్టిన సుందరీకరణ పనులను ఆదివారం తన అనుచరులతో కలసి పరిశీలించారు. తుమ్మలగుంట చెరువు ఎక్కడన్న నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వంద ఎకరాల చెరువును రూ.150కోట్ల తుడా (ప్రజాధనం)నిధులతో ఆనవాళ్లు లేకుండా సొంత ఎస్టేట్‌లా తీర్చిదిద్దుకోవడం దుర్మార్గమని వాపోయారు. ఈ సొమ్మును ఎమ్మెల్యేనే తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే చెరువులో చేపడుతున్న పనులను నిలుపుదల చేయాలని కోరారు. అలాగే బాధ్యుడైన ఎమ్మెల్యేని, నిధులు అందించి సహకరించిన తుడా అధికారులపై చర్యలు చేపట్టి.. చెరువుని చెరువు మాదిరిగానే అభివృద్ధి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఈ చెరువు పరిరక్షణకు పరిసర గ్రామాలప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించండి

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఉమామహేశ్వరిదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం ద్వారా అనుకున్న రంగంలో వారు రాణించడానికి అవకాశం కలుగుతుందని ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఉమామహేశ్వరిదేవి పేర్కొన్నారు. పద్మావతి వర్సిటీ ఎంబీఏ విభాగంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ముగింపు సభకు ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సృజనాత్మక భావాలను ప్రోత్సహించాలన్నారు. వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ వ్యాపార రంగంలో సాంకేతికత అంశంపై ఈ తరం యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సు చాలా అర్థవంతంగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ కాత్యాయిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో వృద్ధుడి అదృశ్యం



హనుమంత రాయప్ప (ఫైల్)

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కర్ణాటకకు చెందిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయాడు. తిరుమల వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక ముఖనేహళ్లికి చెందిన హనుమంతరాయప్ప(64)తో కలిసి కుమారుడు సిద్దరాజు, కుటుంబ సభ్యులు జనవరి 29వ తేదీన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనానికి క్యూ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 18వ కంపార్టుమెంట్‌కు చేరుకున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లివస్తానని చెప్పిన హనుమంతరాయప్ప తిరిగి రాలేదు. పరిసరాలతో పాటు తిరుమల, సొంతూరులో ఎంత గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తిరిగి తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమంతరాయప్ప వివరాలు తెలిసిన వారు 0877 2289027, 94407 96771లకు తెలియజేయాలని పోలీసులు ఆదివారం ఓ ప్రకటన ద్వారా కోరారు.



అద్దంకిలో ఆదివారం నిర్వహించిన వైసీపీ సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు తిరుపతి నుంచి ఆర్టీసీ బస్సులను తీసుకెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గమ్య స్థానాలకు చేరుకునేందుకు నానా తంటాలు పడ్డారు. గంటల తరబడి బస్టాండులో వేచి ఉండాల్సి వచ్చింది.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం ఎదుట హైకోర్టు జడ్జి జస్టిస్ నరేందర్

తిరుచానూరు, మార్చి 10: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

నృత్యం ముగ్ధ మనోహరం



తిరుచానూరు, మార్చి 10: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి శంకర నాట్య విద్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యం నగరవాసులను ఆకట్టుకుంది. కళాకారులు నిశాంతి, కృతిక, సాయి దర్శిని, భువన కృతి రామానుజ జయ, గోవిందన్ గుడ్ కందసిస్తాక్ కవచం, అవినిదనిలే, అల్వాన పళని మని దండకం, భో శంభో తదితర కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

వేడుకగా పరాశరేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు, మార్చి 10: తిరుచానూరు యోగిమల్లవరంలో కొలువైన ఉన్న కామాక్షాంబ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన కల్యాణోత్సవంతో మహాశివరాత్రి వేడుకలు ముగిశాయి. స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చి సర్వాంగ సుందరంగా అలంకరించి శివనామ స్మరణల మధ్య వేదోక్తంగా అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి

● మృతుడు టీటీడీ విజిలెన్స్ ఉద్యోగిగా గుర్తింపు



మృతి చెందిన శేషసాయికుమార్

రైల్వేకోడూరు, మార్చి 10: మండలంలోని అనంతరాజుపేట వద్ద కారు ఢీకొని స్కూటరిస్టు ఆదివారం మృతి చెందాడు. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ప్రధాన దారిలో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు కడప వైపు నుంచి తిరుపతి వైపు వెళుతున్న స్కూటరిస్టును ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఆర్.శేషసాయికుమార్ (30) మృతి చెందాడు. మృతుడు టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ టి.బాబు తన సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుమలేశుడి సేవలో క్రికెటర్ నవదీప్



నవదీప్ సైనీ

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం క్రికెటర్ నవదీప్ సైనీ దర్శించుకున్నారు. అలాగే ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం కూడా స్వామి సేవలో పాల్గొన్నారు.

లోకశాంతి కోసం ప్రార్థించా: మధ్యప్రదేశ్ మాజీ సీఎం

లోకశాంతి కోసం స్వామిని ప్రార్థించానని మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తిరుమలేశుడిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆజాదీకా అమృతోత్సవంలో భాగంగా వికసిత్ భారత నిర్మాణం జరుగుతోందన్నారు. ఇక, టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తుపై మీడియా ప్రశ్నించగా ఆయన మాట్లాడేందుకు నిరాకరించారు. తిరుమలలో రాజకీయాలు వద్దు అంటూ వెళ్లిపోయారు.

రూ.64 లక్షలు, 113 గ్రాముల బంగారం పట్టివేత



చిల్లకూరు, మార్చి 10: తిరుపతి జిల్లాలోని చిల్లకూరు మండలంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద ఆదివారం వేకువన సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి సిబ్బందితో కలసి తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం తామరపల్లి గ్రామానికి చెందిన మణికంఠ, నరసన్నపేటకు చెందిన మన్మధరావులు శ్రీకాకుళం నుంచి చెన్నైకి కారులో రూ.64 లక్షల నగదు, 113 గ్రాముల బంగారాన్ని ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తీసుకెళుతున్నట్లు గుర్తించారు. పట్టుబడిన నగదు, బంగారాన్ని ఆదాయపన్నుశాఖకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

2025 ఆగస్టులో అంతర్జాతీయ రైల్వేస్టేషన్ ప్రారంభిస్తాం

రేణిగుంట, మార్చి 10: తిరుపతి అంతర్జాతీయ రైల్వే స్టేషన్‌ను 2025 ఆగస్టు నెలలో ప్రారంభిస్తామని గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్ తెలియజేశారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, రేణిగుంట రైల్వేస్టేషన్లు భవిష్యత్తులో మరింత పురోగతి సాధిస్తాయన్నారు. 2024 ఆగస్టు 24న తిరుపతి రైల్వేస్టేషన్ దక్షిణ భాగాన్ని తొలుత అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. 2025 ఆగస్టులో పూర్తి స్థాయిలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం రేణిగుంట రైల్వే స్టేషన్ పార్కింగ్ సమస్యలను పరిశీలించారు. త్వరలో పరిష్కరిస్తామన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రామకృష్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10: ఎస్వీయూ బోటనీ పరిశోధకుడు కె.రామకృష్ణ డాక్టరేట్ పొందారు. స్టడీస్ ఆన్ సింథసిస్, క్యారెక్టరైజేషన్, వాలిడేషన్ అండ్ అప్లికేషన్ ఆఫ్ నానోపార్టికల్స్ ఫ్రం ఫైకస్ మొల్లిస్ వాహ్ల - మెడిసినల్ ప్లాంట్ స్పైసిస్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ సావిత్రమ్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

తిరుపతి

రామనామస్మరణతో పులకించిన సప్తగిరులు

● భక్తిసాగరంలో ముంచెత్తిన అయోధ్యకాండ పారాయణం



తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 8వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 26 నుంచి 30వ సర్గ వరకు ఉన్న 156 శ్లోకాలు, యోగ వాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 181 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీనివాస్ బృందం 'వందనము రఘు వందన సేతు.., రామ రామ అన రాదే..' అను కీర్తనలను రసరమ్యంగా ఆలపించారు.

విద్య, వైద్యం కోసం పోరాటం సాగిస్తాం : ఐజేకే



మీడియాతో మాట్లాడుతున్న ఆనంద మురుగన్

తిరుపతి(ఆటోనగర్) మార్చి 10 : రాష్ట్ర ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించే అంశంపై తమ పోరాటం సాగిస్తామని ఇండియా జననాయక కచ్చి పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టి.ఆనందమురుగన్ వెల్లడించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ పార్టీ దేశవ్యాప్తంగా కులమతాలకతీతంగా ప్రజలకు సేవలందించడానికి ఏర్పడిందన్నారు. తమ పార్టీ బీజేపీతో కలసి పనిచేస్తుందని తెలిపారు. నాయకులు ఎస్.రమేష్, ఎం.శక్తి, ఆర్.గోపీనాథ్ పాల్గొన్నారు.

దోబీ ఘాట్ స్థల ఆక్రమణను అడ్డుకోండి

తిరుపతి(ఆటోనగర్) మార్చి10 : తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నెంబరు 214లో 50 సెంట్ల దోబీ ఘాట్ స్థలాన్ని అధికార పార్టీ నేతలు ఆక్రమించుకుంటున్నారని, అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే దాడికి పాల్పడుతున్నారని శ్రీవేంకటేశ్వర రజక కో-ఆపరేటివ్ సంఘ నాయకులు కె.శివయ్య, కె.సుబ్రమణ్యం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ 2004లో దోభీఘాట్ నిర్మాణం కోసం సదరు స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 2007లో దోబీ ఘాట్ నిర్మాణం కోసం అప్పటి తహసీల్దార్ పి.సురేంద్రబాబు బీసీ వేల్ఫేర్ కార్యాలయానికి సిఫార్సు చేశారన్నారు. నిర్మాణం చేపట్టే సమయంలో వేదాంతపురానికి చెందిన పి.ముత్యాలయ్య ఈ స్థలంపై కోర్టును ఆశ్రయించారని, అందులో సొసైటీకి అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. ఈ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, అడ్డుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, కందారపు శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ జూపార్కులో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మంగళం, మార్చి 10 : ఎస్వీ జూపార్కులో కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత జూ అధికారులు సందర్శకుల రక్షణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పులులు, సింహాల ఎన్‌క్లోజర్లు, వాటి వద్దకు వెళ్లేదారుల్లో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జూలో 60 సీసీ కెమెరాలు ఉన్నట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాదాపు రూ.2లక్షలతో కొత్త కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు జంతువులు వేసవి తాపం తట్టుకునే విధంగా స్ప్రింక్లర్స్, గ్రీన్‌షేడ్ నెట్, వట్టివేర్ల తెర, కూలర్లు, ఫాగర్స్, ఎగ్జిట్ ఫ్యాన్లు, గ్లూకోజ్ తెప్పించామన్నారు.

రేపు మూడో విడత ఇళ్లపట్టాల పంపిణీ

తిరుపతి అర్బన్, మార్చి 10: టీటీడీ ఉద్యోగులకు మంగళవారం మూడో విడత ఇళ్లపట్టాలు పంపిణీ చేయనున్నామని, సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్స్ కుటుంబ సభ్యులతో హాజరవ్వాలని టీటీడీ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.ప్రభాకర‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 8 గంటలకు ఏర్పేడు, వెంకటగిరి మార్గంలోని పల్లంపేటలో ఇంటిస్థలం మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్ అందజేస్తారని తెలిపారు.

ఆక్యుపంక్చర్ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



డాక్టర్ ఎంఎస్ బాలాజీని సత్కరిస్తున్న వేమన విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 10 : యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో పది రోజులపాటు నిర్వహించిన ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో డాక్టర్ బాలాజీ చేస్తున్న వైద్య సేవలను వక్తలు అభినందించారు. తీవ్ర ఆరోగ్య సమస్యలతో వచ్చిన పలువురు రోగం నయం చేసుకుని వెళ్లిన ఉదంతాలను వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ నుంచి ప్రజలను కాపాడాలంటే సంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. శిబిరానికి స్పందన బావున్నందున ఇక నుంచి ప్రతి మంగళవారమూ ఉచిత ఆక్యుపంక్చర్ సేవలను వేమన విజ్ఞాన కేంద్రంలో అందిస్తామని డాక్టర్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సేవలందించిన డాక్టర్ బాలాజీని, వారి సిబ్బందిని శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, సీనియర్ జర్నలిస్టు ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగస్టులో తిరుపతిలో రాజధానికి పునాది రాయి

● మాజీ ఎంపీ చింతా మోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): రాబోయే జూలై, ఆగస్టులో తిరుపతిలో రాజధానికి పునాది రాయి వేసే బాధ్యత తాను తీసుకుంటానని మాజీ ఎంపీ చింతా మోహన్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీకి వెళ్లిన తాను దాదాపు జాతీయ నాయకులందరినీ కలిసినట్టు తెలిపారు. రాయలసీమ భాగ్యసీమగా మారాలంటే తిరుపతి రాజధాని కావడమే మార్గమన్నారు. ఇది దాదాపు 70 ఏళ్ల క్రితం ఎంజీ రంగాకు వచ్చిన ఆలోచన అన్నారు. తిరుపతి రాజధాని కావాలని, దేశ ప్రధాని మంచివాడు రావాలని స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

తిరుపతి (రవాణా), మార్చి 10 : నగర పరిధిలోని జీవలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజైన ఆదివారం శాంతి అభిషేకం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి ఏర్పాట్లును పర్యవేక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 68,446 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,549 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీలో జీవో 114 అమలు చేయాలి

తిరుపతి అర్బన్, మార్చి 10: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 114ను వెంటనే అమలు చేయాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నూతన జీవో ప్రకారం మూడు రోజుల క్రితం ఆరోగ్య, వైద్య శాఖల పరిధిలోని 362 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేసినట్లు గుర్తు చేశారు. జీవో విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా టీటీడీలో అమలుకాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్, ఈవో స్పందించాలని కోరారు.

ముక్కంటికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జ్ఞానప్రసూనాంబ, శ్రీకాళహస్తీశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ తరపున ఈవో ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న ఈవోకు శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, సభ్యులు స్వాగతం పలికారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న ఈవో, ఇతర ముఖ్యులతో కలిసి సోమస్కంద మూర్తి, శ్రీజ్ఞాన ప్రసూనాంబకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఈవో వాయులింగేశ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబ, గురుదక్షిణామూర్తిని దర్శించుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

రేపు డీడీయూ-జీకేవై పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుపతి(విద్య), మార్చి 10 : తిరుచానూరులోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన(డీడీయూ-జీకేవై)పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏడీ జ్యోతి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, వైఎస్సార్ కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో 2022-23, 2023-24 సంవత్సరాల్లో డీడీయూ-జీకేవై ద్వారా శిక్షణ పొంది వివిధ రంగాల్లో ఉపాధి సాధించిన దాదాపు 600మంది పూర్వ విద్యార్థులు హాజరుకానున్నట్లు ప్రకటించారు. సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, అడ్వైజర్ శ్రీధర్‌రెడ్డి, ముఖ్య నిర్వహణాధికారి ఎంకేవీ శ్రీనివాసులు, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, సిబ్బంది, ట్రైనింగ్ పార్టనర్లు పాల్గొంటారని తెలిపారు.

నేడు రాళ్లపల్లి వర్ధంతి

తిరుపతి (కల్చరల్), మార్చి 10: తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల రాగిరేకులను పరిష్కరించి, గ్రంథస్తం చేసిన ప్రముఖ పరిశోధకులు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ 45వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటలకు పద్మావతి మహిళా వర్సిటీ మార్గంలోని రాళ్లపల్లి విగ్రహానికి అధికారులు పుష్పాంజలి ఘటిస్తారు. సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు విభీషణ శర్మ అధ్యక్షతన సభ జరుగుతుంది. ఇందులో రాళ్లపల్లి మనవరాలు, సంస్కృత వర్సిటీ ఆచార్యులు రాళ్లపల్లి దీప్తి, సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, ఎన్.సి.శ్రీదేవి ప్రసంగిస్తారు.

తిరుమలలో పట్టుబడిన నాగుపాము



తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం ఆరడుగుల నాగుపాము పట్టుబట్టింది. శ్రీవారి పాదాల సమీపంలోని కాటేజీల వద్దకు నాగుపాము వచ్చింది. గుర్తించిన భక్తులు, స్థానికులు పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని దాన్ని చాకచక్యంగా పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

ముగిసిన కపిలేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం



నటరాజస్వామి వారి తిరువీధి



కపిల తీర్థంలో త్రిశూలస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి (కల్చరల్), మార్చి 10: పది రోజుల పాటు వైభవంగా జరిగిన కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు నటరాజస్వామివారి ఊరేగింపు జరిగింది. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా ఆలయ పుష్కరిణిలో త్రిశూలస్నానం నిర్వహించారు. తర్వాత వరుసగా తిరుమంజనం, పూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య ధ్వజావరోహణం నిర్వహించారు. రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య రావణాసుర వాహన సేవతో కపిలేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల తదితరులు పాల్గొన్నారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నాపేరుంటే దర్శనం ఇవ్వద్దని ఆదేశిస్తారా?

● టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): తన పేరు ఉంటే దర్శనానికి అనుమతి ఇవ్వద్దని ఉద్దేశపూర్వకంగా ఈవో హుకుం జారీ చేయడం మంచి పద్ధతి కాదని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడి హోదాలో శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. దేవస్థానం అనేది భక్తుల కోసం నిర్మించారన్నారు. వ్యక్తిగత కక్షల కోసం శ్రీవారి దర్శనానికి రానియ్యకుండా అపడం మంచిది కాదన్నారు. బోర్డు మాజీ సభ్యుడిగా దర్శనం చేసుకునే అవకాశం తనకు దేవుడు కల్పించాడన్నారు. ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వస్తున్న ప్రముఖుల లేఖల్లో తన పేరు ఉంటే టీటీడీ తొలగిస్తోందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గతంలో కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ దర్శనానికి వచ్చినపుడు ఆయన సిఫార్సు లేఖలో తన పేరు ఉందని అనుమతించలేదన్నారు. దర్శనం చేసుకోకుండానే తిరిగి వెళ్లిపోతానని కేంద్రమంత్రి చెప్పడంతో తనకు దర్శన టికెట్ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు లేఖలోనూ తన పేరును తొలగించారన్నారు. ఇక తాజాగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ ఇచ్చిన సిఫార్సు లేఖలోనూ తన పేరును తొలగించారన్నారు. దీనిపై శివరాజ్ సింగ్ ఈవోతో మాట్లాడేందుకు ప్రయత్నం చేసినా స్పందించకపోవడంతో రాష్ట్ర సీఎస్ జవహర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారన్నారు. ఈవో ధర్మారెడ్డి మూర్ఖత్వంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 10 : మహిళా సాధికారత ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని డీఆర్‌డీఏ జిల్లా అధికారిణి జ్యోతి అన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో స్థానిక మేక్ షై బేబీ జీనియస్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు శాంతిదుర్గ అధ్యక్షత వహించగా డీఆర్‌డీఏ జిల్లా అధికారి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వారికి మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. మరో ముఖ్య అతిథి ఉపాధ్యాయ సంఘ నాయకురాలు నిర్మల మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర ముఖ్య అతిథులు డాక్టర్ చత్రప్రకాష్ రెడ్డి, పాఠశాల అధినేత భాస్కర్‌రాజు మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాల్సిన అవసరముందన్నారు. తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు మహిళల పట్ల జరుగుతున్న సైబర్ నేరాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి నాగమణి, చైల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్ల అధ్యక్షుడు తులసీరామ్, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమాత బాలికల ఆవాస ప్రథమ వార్షికోత్సవం



తిరుపతి(విద్య),మార్చి10: రైల్వేకాలనీలోని శ్రీమాత బాలికల ఆవాసం సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన చిన్మయ ఆశ్రమానికి చెందిన పవిత్రానంద సరస్వతి మాట్లాడుతూ అనాథ ఆడపిల్లలకు చేయూతనందించి వారి ఉన్నతికి కృషి చేస్తున్న సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మార్తా భాస్కర్‌రావు మాట్లాడుతూ కొవిడ్ సమయంలో తల్లిదండ్రులు కోల్పోయిన ఆడపిల్లలకు చేయూతనందించేందుకు సంస్థను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఆరుగురు చదువుతున్నారని తెలిపారు. తల్లి లేదా తండ్రి లేని పిల్లలను ఆవాసంలో చేర్పించాలని, వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారం అందిస్తామని చెప్పారు. ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ లలిత, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మనోహర్, వెంకటాచలం, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్, మునికృష్ణయ్య యాదవ్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి



కార్యక్రమంలో ఏపీ బీసీ జేఏసీ నేత గోపాల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10: విద్యా కేంద్రమైన తిరుపతిలో భారతీయ తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ బీసీ జేఏసీ నేత గోపాల్ డిమాండ్ చేశారు. ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద ఆదివారం నిర్వహించిన సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక యూనివర్సిటీలు, కాలేజీలు, స్కూళ్లు గల తిరుపతిలో సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక విప్లవకారిణిగా నిలిచిన ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఈ తరంలో ఎంతో స్ఫూర్తి నింపవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బడి సుధాయాదవ్, డాక్టర్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

టీడీపీ తిరుమల కమిటీ ఏర్పాటు



తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ తిరుమల కమిటీని ఆదివారం నియమించారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసం లో కమిటీ నివేదికను తిరుమల నాయకులకు అందజేశారు. పార్టీ తిరుమల అధ్యక్షుడిగా రాజుయాదవ్‌తోపాటు ఐదుగు రు ఉపాధ్యక్షులు, ఒక జనరల్ సెక్రటరీ, నలుగురు ఆర్గనైజ్ సెక్రటరీలను ఏర్పాటు చేశారు. ఏడుగురిని కార్యదర్శులుగా, ముగ్గురిని అధికార ప్రతినిధులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, తిరుపతి అధ్యక్షుడు చినబాబు, రాష్ట్ర నాయకులు బుల్లెట్ రమణ, దంపూర్ భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చట్ట సభల్లో అవకాశమివ్వాలి: బీడీపీ



లోగో, జెండా, మేనిఫెస్టో విడుదల చేస్తున్న బీడీపీ నేతలు

తిరుపతి అర్బన్, మార్చి 10: దివ్యాంగులకు, వికలాంగులకు చట్టసభల్లో అవకాశమివ్వాలని సౌత్ ఇండియా దివ్యాంగుల నెట్‌వర్క్ కన్వీనర్ ఎన్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో భారత దివ్యాంగ పార్టీ(బీడీపీ) ఏపీ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. పార్టీకి సంబంధించిన లోగో, జెండా, మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులు, వికలాంగులే వెనుకబడిఉన్నారని తెలిపారు. నేతలు వారికి పింఛన్‌తో సరిపెడుతున్నారు తప్పా చట్టసభల్లో అవకాశమివ్వడంలేదని విమర్శించారు. 1931 తర్వాత దివ్యాంగుల గణన జరగలేదని గుర్తు చేశారు. నాలుగు శాతం రిజర్వేషన్ ఆధారంగా పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు చట్టసభల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. బీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షుడు మాధవన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయడానికి సమాయత్తమవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, రాష్ట్ర నాయకులు అవుల నాగేంద్ర, గౌరవ సలహాదారు తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్రి వెంకటరమణ, కోశాధికారి శేనాపతి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రామరాజు, లక్ష్మీనారాయణ, రెడ్డియ్య, మహిళా నాయకులు శివకుమారి, చెంచులక్ష్మి, మణికుమారి, మురళి పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు..

రుయా సీటీ స్కానింగ్ కేంద్ర సిబ్బందిపై డీఎంఈకి ఫిర్యాదు

తిరుపతి సిటీ, మార్చి 10 : రుయా ఆస్పత్రిలోని ఉచిత సీటీ స్కానింగ్ కేంద్రంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని హైదరబాద్‌లో స్థిరపడిన తిరుపతి వాసి నాలుగు రోజుల కిందట డీఎంఈకి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. తిరుపతికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి పి.దామోధరనాయుడు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. తిరుపతికి వచ్చిన ఆయనకు ఊపిరితిత్తుల సమస్య రావడంతో గత నెల 24న రుయాస్పత్రికి వచ్చాడు. అక్కడ వైద్యులు పరీక్షించి సీటీ స్కానింగ్ పరీక్ష చేయించుకురావాలని సూచించారు. ఆయన పక్కనే ఉన్న ఉచిత సీటీ స్కానింగ్ కేంద్రానికి వెళ్లగా యంత్రం పనిచేయడం లేదని, రెండు రోజుల తర్వాత రావాలని సూచించారు. రెండు రోజుల తర్వాత వెళ్లినా మళ్లీ అదే సమాధానం చేప్పారు. ఇలా పది రోజులు తిరిగి చివరకు గట్టిగా అడగటంతో సీటీ స్కానింగ్ పరీక్ష చేశారు. రిపోర్టులు కావాలని సిబ్బందిని అడగ్గా రెండు రోజుల తర్వాత వచ్చి తీసుకోవాలని చెప్పారు. పరీక్షకే ఇన్ని రోజులు పడితే ఇక రిపోర్టులు ఎన్ని రోజులకు ఇస్తారని సిబ్బందిని నిలదీయడంతో రూ.600 చెల్లిస్తే వెంటనే ఇస్తామని చెప్పారు. రూ.600 చెల్లించడంతో గంటలోనే రిపోర్టులు ఇచ్చారు. నగదు తీసుకున్నందుకు రశీదు అడగ్గా అలాంటివేమీ లేవని దురుసుగా సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై ఆయన ఈనెల 6న విజయవాడలోని డీఎంఈకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎంఈ విచారణ జరిపి నివేదిక పంపాలని రుయా అధికారులను ఆదేశించారు.

శుభ కార్యానికి వెళ్తూ... పరలోకానికి

బైక్‌ను ఢీకొన్న లారీ ● ఇద్దరు యువకుల దుర్మరణం

మరో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో హేమంత్, వెంకటేశ్వర్లు మృతదేహాలు

నాయుడుపేట టౌన్, మార్చి 10: శుభకార్యానికి వెళ్తూ... రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరు పట్టణానికి చెందిన హేమంత్, వెంకటేష్, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన బాలాజీ నెల్లూరులోని ఓ మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలో శుభకార్యానికి హాజరయ్యేందుకు మోటారు సైకిల్‌పై ముగ్గురు స్నేహితులూ బయలుదేరారు. నాయుడుపేట మండలం మూర్తిరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో హేమంత్(17), వెంకటేష్ (22) అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు బాలాజీ తీవ్రంగా గాయపడగా అతడిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ సీనియర్ నేత సత్య మృతి

సత్యవేడు, మార్చి 10: సత్యవేడుకు చెందిన టీడీపీ సీనియర్ నేత, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ సత్య మొదలియార్(70) ఆదివారం మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్య పట్టణంలోని ఆయన నివాస ంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

మాడ వీధుల్లో రాజకీయ ఫ్లెక్సీలు



శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తిలోని చతుర్మాడ వీధుల్లో రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై భక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ప్రస్తుతం మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. నిత్యం స్వామి అమ్మవార్ల నగరోత్సవం జరుగుతుంది. ఆదివారం అందులోనూ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం పెళ్లి మండపం వద్ద జరిగింది. సోమవారం శ్మశాన వాటికలో కైలాస ధామం ప్రారంభిస్తున్నట్లు వైసీపీ నాయకులు మాడవీధుల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పిచ్చాటూరు, మార్చి 10: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి కుటుంబానికి వైసీపీ మండల కన్వీనర్ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మండలంలోని రామాపురం అరుంధతివాడకు చెందిన భవానిశంకర్ (21) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం వారి ఇంటికి వెళ్లి సాయం అందజేశారు. అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కుర్చీలు కూడా కరువేనా...?



నగిరి వీధిలో కుర్చీలు లేక నిలబడి ఉన్న బాల్య వివాహాల నియంత్రణ బృందం

శ్రీకాళహస్తి మార్చి 10: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉద్యోగులకు కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయక పోవడం విమర్శలకు దారితీసింది. ముక్కంటి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహిస్తున్నామని అధికారులు ప్రకటించుకుంటున్నారు. కానీ భక్తులకు మాత్రం తోపులాటలు తప్పడం లేదు. ఉత్సవాల్లో బాల్యవివాహాల నియంత్రణకు ప్రత్యేకంగా యం త్రాంగం పనిచేస్తుంటుంది. పలు ప్రభుత్వ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి శివ పార్వతుల కళ్యాణం రోజున చెక్ పోస్టులు నిర్వహించి తనిఖీలు చేస్తారు. ఆదివారం శ్రీకాళహస్తిలో పట్టణ వ్యాప్తంగా బాల్య వివాహాలు నియంత్రణ కోసం 11 బృందాలను నియమించారు. ఉద్యోగులకు విధులు కేటాయించారు తప్ప పలు చోట్ల వారికి కనీసం కుర్చీలు ఏర్పాటు చేయలేదు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నిరంతరాయంగా ఈ బృందాలు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే పలుచోట్ల ఉద్యోగ బృందాలకు కనీస సౌకర్యం కూడా కల్పించలేదు. కోట్లు ఖర్చుపెట్టి ఉత్సవాల నిర్వహిస్తున్నామని ప్రకటించుకునే పాలకులు, అధికారులు కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదా అంటూ జనం చర్చించుకున్నారు.

రాక్షసపాలనకు చరమగీతం: నెలవల

నాయుడుపేట టౌన్, మార్చి 10: రాష్ట్రంలో రాక్షసపాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆకుతోట రమేష్, శంఖు సురేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మధునాయుడు, పెంచలయ్య పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



సత్యవేడు, మార్చి 10: సత్యవేడు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సత్యవేడు దేవాంగ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సత్యవేడు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో దుస్తులు అందించారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు మన్నే సోమశేఖర్, మన్నే సుజాతలు పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ ఉపాధ్యక్షుడు మన్నే ముద్దు శ్రీనివాసులు, సత్యవేడు దేవాంగ సంఘం అధ్యక్షుడు జక్కల పాండురంగయ్య, ప్రధాన కార్యదర్శి యారాశి మురళీకృష్ణ, రాష్ట్ర దేవాంగ సంఘం కార్యవర్గ సభ్యులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఎన్నికల 'ఎర'



పూడిరాయదొరువు వద్ద పూడిపోయిన ఇసుకమేటలు

వాకాడు, మార్చి 10: పులికాట్‌లో పూడికతీత పనులకు ఈనెల 12న ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా ప్రకటించడం చర్చనీయాంశమవుతోంది. 2017 జనవరిలో పాదయాత్రలో భాగంగా నాయుడుపేటకు వచ్చిన జగన్ పులికాట్‌కు పూర్వవైభవం తెస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించారు. మత్స్యకారుల జీవనోపాధి పెంపొందించడం కోసం సముద్ర ముఖద్వారాల పూడికతీత పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.50కోట్లతో పూడిక పనులు చేపడుతున్నామని ప్రకటించింది. ప్రభుత్వం మారడంతో పనులు అటకెక్కాయి. 2022లో రూ.123 కోట్ల వ్యయంతో పూడిక పనులతో పాటు మినీ హార్బర్ ఏర్పాటు చేస్తామని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఊదరగొట్టారు. జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని గత ఏడాది నవంబరు 21వ తేదీ సీఎం జగన్ పులికాట్‌లో పూడికతీత పనులకు శంకుస్థాపన చేస్తారంటూ హడావుడి చేశారు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న తరుణంలో శనివారం కలెక్టర్‌తో పాటు ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఆర్డీవో కిరణ్‌కుమార్ బోట్‌లో వెళ్లి వాకాడు మండలం పూడిరాయదొరువు పంచాయతీ పరిధిలోని సముద్ర ముఖద్వారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నవాబుపేట మత్స్యకారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల జీవన ప్రమాణాలను అభివృద్ధి పరిచేందుకు రూ.123 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పూడిరాయదొరువు సమీపంలో పూడికతీత పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక అదిగో ఇదిగో అంటూ ఐదేళ్లు కాలయాపన చేసి, తాజాగా వర్చువల్ విధానంలో జగన్ శంకుస్థాపన చేస్తారని చెప్పడం ఎన్నికలకు ఎర వేసేందుకేనని మత్స్యకార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అసలు అనుమతులే రాకుండా, నిధులు మంజూరు కాకుండా పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేయడం ద్వారా మత్స్యకారులను మోసం చేయడానికి సిద్ధమైపోయారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు తామూ సంసిద్ధంగా ఉన్నామని మత్స్యకారులు అంటున్నారు.

ఆరేళ్ల తరువాత చంద్రగిరి కోటలో లైటింగ్ షో

- తిలకించిన ఆర్కియాలజీ, టూరిజం అధికారులు



చంద్రగిరి, మార్చి10: చంద్రగిరి కోటలో ఆరేళ్ల తరువాత లైటింగ్ షోను పునః ప్రారంభించడానికి అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం పురా వస్తుశాఖ సూపరింటెండెంట్ గోపినాథ్‌జన్నా, ఆర్కియాలజీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దేవేంద్ర నాథ్‌బోయే, ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, లక్స్ అండ్ డిజబుల్ సంస్థ ఇంజనీర్ శివపిళ్ళై, సీఈవో రవి తదితరులు చంద్రగిరి కోటను సందర్శించారు. రాత్రి లైటింగ్ షోను తిలకించారు. 2018లో జూలైలో భారీ వర్షాలతో కోటలో రాజు గోపురంపై పిడుగు పడింది. దీంతో లైటింగ్ షో మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి లైటింగ్ షో లేకుండా పోయింది. ఇటీవల ప్రభుత్వం లక్స్ అండ్ డిజబుల్ సంస్థతో కొన్ని ఒప్పందాలు చేసుకుని మళ్ళీ పర్యాటకుల కోసం లైటింగ్ షోను ప్రదర్శించడానికి సిద్ధమైంది. దీంతో కోటలో లైటింగ్ షోను మరమ్మతులు చేశారు. దీంతో ఆర్కియాలజీ, ఏపీ టూరిజం అధికారులు లైటింగ్ షోను తిలకించి, త్వరలో షో పునఃప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ సీఏ ప్రవీణ్‌కుమార్, లైటింగ్ షో అసిస్టెంట్ మేనేజర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

2025 ఆగస్టులో అంతర్జాతీయ రైల్వేస్టేషన్ ప్రారంభిస్తాం



పార్కింగ్ సమస్యలను పరిశీలిస్తున్న డీఆర్ఎం వినీత్‌సింగ్

రేణిగుంట, మార్చి 10: తిరుపతి అంతర్జాతీయ రైల్వే స్టేషన్‌ను 2025 ఆగస్టు నెలలో ప్రారంభిస్తామని గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్ తెలియజేశారు. ఆదివారం సాయం త్రం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, రేణిగుంట రైల్వేస్టేషన్లు భవిష్యత్తులో మరింత పురోగతి సాధిస్తాయన్నారు. 2024 ఆగస్టు 24న తిరుపతి రైల్వేస్టేషన్ దక్షిణ భాగాన్ని తొలుత అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. 2025 ఆగస్టులో పూర్తి స్థాయిలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం రేణిగుంట రైల్వే స్టేషన్ పార్కింగ్ సమస్యలను పరిశీలించారు. త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీవోఎం శ్రావణ్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్య నారాయణ, ఎస్ఎస్ శేషగిరినాథరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతీశ్వరస్వామి కల్యాణోత్సవం



వరదయ్యపాళెం, మార్చి 10: వరదయ్యపాళెం మండలంలోని కోవూరుపాడు గ్రామంలో వెలసిన జ్యోతీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల కల్యాణం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. సుందరంగా అలంకరించి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడే కొందరు వివాహాలు చేసుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్త నందయ్య నాయుడు మంగళసూత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాన్ని వీడి.. ఊర్లోకొచ్చి వివాహం





కల్యాణానికి విచ్చేసిన భక్తులతో నిండిన వీధులు (ఇన్‌సెట్లో) పూజలు నిర్వహించే ప్రాంగణం

శ్రీకాళహస్తి మార్చి 10: దేశంలో ఎక్కడా లేనివిధంగా దేవుళ్లు.. ఆలయాన్ని వీడి, ఊర్లోకి వచ్చి వివాహం చేసుకోవడం ఒక్క శ్రీకాళహస్తిలో మాత్రమే జరుగుతుంది. ఈ ఉత్సవానికి శాశ్వత ఉభయదారులుగా కైకాల వంశస్థులు వ్యవహరిస్తున్నారు. వీరు ప్రస్తుతం జిల్లాలోని చెంబేడు గ్రామంతోపాటు 14 గ్రామాల్లోనూ, తమిళనాడులోని తిరుత్తణి ప్రాంతంలో పలు గ్రామాల్లో ఉంటున్నారు.

రూ.64 లక్షలు, 113 గ్రాముల బంగారం పట్టివేత



నగదు, బంగారాన్ని చూపుతున్న పోలీసులు

చిల్లకూరు, మార్చి 10: చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వేకువన సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం తామరపల్లి గ్రామానికి చెందిన మణికంఠ, నరసన్నపేటకు చెందిన మన్మధరావులు శ్రీకాకుళం నుంచి చెన్నైకి కారులో రూ.64 లక్షల నగదు, 113 గ్రాముల బంగారాన్ని ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తీసుకెళుతున్నట్లు గుర్తించారు. పట్టుబడిన నగదు, బంగారాన్ని ఆదాయపన్నుశాఖకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

రేణిగుంట, మార్చి 10: నగదు చెల్లింపుల విషయంలో ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హెల్ప్ ఏజ్ ఇండియా, గూగుల్ సంస్థ వారు పేర్కొన్నారు. రైల్వే విశ్రాంత ఉద్యోగులకు ఆన్‌లైన్ మోసాలపై ఆదివారం పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో డిజిటల్ సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైల్వే పెన్షనర్ అసోసియేషన్ చైర్మన్ సాహెబ్, విజయ కుమార్, ఆశ అధ్యక్షులు జూలియస్‌రాజు, రంగయ్య, రవికుమార్, కోదండరామయ్య, కాశీం, సుధాకర్‌బాబు, వరలక్ష్మి, రామమూర్తి, మదీన పాల్గొన్నారు.

కలలను సాకారం చేసుకోండి



రేణిగుంట, మార్చి 10: విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి కృషిచేయాలని సాయిసుధా ఆస్పత్రి ఎండీ, ప్రముఖ వైద్యులు సుకుమార్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు భవనంలో నిర్వహించిన ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఏడో వార్షికోత్సవానికి డీఎస్పీ భవ్యకిషోర్‌తో కలిసి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గౌతమి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్‌లో అగ్నిప్రమాదం

రేణిగుంట, మార్చి 10: తిరుపతి - రేణిగుంట మార్గమధ్యలోని రైల్వే క్యారేజీ రిపేరు షాపులో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. క్యారేజ్ రిపేర్‌షాపులో ట్రైన్ కోచ్ విడిభాగాలు ప్లైవుడ్, ఇతర పరికరాల స్క్రాప్‌ను ఓ ప్రాంతంలో పెద్దమొత్తంలో నిల్వ ఉంచారు. మధ్యాహ్నం వేడికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. కొంతసేపటికి భారీ ఎత్తున అగ్నికీలలు ఎగసిపడ్డాయి. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి వాటర్ ట్యాంకర్‌లోని నీటిని మోటారు సాయంతో చల్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు.

నేడు కైలాస ముక్తిదామం ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తిలోని శ్మశాన వాటికలో సోమవారం కైలాస ముక్తిదామం ప్రారంభించనున్నట్లు వైసీపీ శ్రేణులు ప్రకటనలో తెలిపారు.

నాపేరుంటే దర్శనం ఇవ్వద్దని ఆదేశిస్తారా?

టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): తన పేరు ఉంటే దర్శనానికి అనుమతి ఇవ్వద్దని ఉద్దేశపూర్వకంగా ఈవో హుకుం జారీ చేయడం మంచి పద్ధతి కాదని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడి హోదాలో శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. దేవస్థానం అనేది భక్తుల కోసం నిర్మించారన్నారు. వ్యక్తిగత కక్షల కోసం శ్రీవారి దర్శనానికి రానియ్యకుండా అపడం మంచిది కాదన్నారు. బోర్డు మాజీ సభ్యుడిగా దర్శనం చేసుకునే అవకాశం తనకు దేవుడు కల్పించాడన్నారు. ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వస్తున్న ప్రముఖుల లేఖల్లో తన పేరు ఉంటే టీటీడీ తొలగిస్తోందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గతంలో కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ దర్శనానికి వచ్చినపుడు ఆయన సిఫార్సు లేఖలో తన పేరు ఉందని అనుమతించలేదన్నారు. దర్శనం చేసుకోకుండానే తిరిగి వెళ్లిపోతానని కేంద్రమంత్రి చెప్పడంతో తనకు దర్శన టికెట్ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు లేఖలోనూ తన పేరును తొలగించారన్నారు. ఇక తాజాగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ ఇచ్చిన సిఫార్సు లేఖలోనూ తన పేరును తొలగించారన్నారు. దీనిపై శివరాజ్ సింగ్ ఈవోతో మాట్లాడేందుకు ప్రయత్నం చేసినా స్పందించకపోవడంతో రాష్ట్ర సీఎస్ జవహర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారన్నారు. ఈవో ధర్మారెడ్డి మూర్ఖత్వంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఎలా ఉన్నారు?

ఎన్టీఆర్ రాజుకు నందమూరి కుమారుడి పరామర్శ



తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వీరాభిమాని అయిన ఎన్టీఆర్ రాజు(రామచంద్రరాజు)ను తన కుమార్తె రూపతో కలిసి నందమూరి మోహన్‌కృష్ణ పరామర్శించారు. తారకరత్న వర్ధంతి సందర్భంగా శనివారం తిరుమలకు వచ్చిన వీరు ఆదివారం స్థానికుడైన రాజును కలిశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను పరామర్శించి, పాతరోజులను గుర్తు చేసుకున్నారు. త్వరలోనే ఆరోగ్యం కుదుటపడుతుందని ధైర్యం చెప్పారు. వీరి వెంట ఫిలిమ్ చాంబర్ సెక్రటరీ ప్రసన్నకుమార్, టీడీపీ స్టేట్ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

పుత్తూరు వార్తలు

శిలాఫలకాల్లోనే అభివృద్ధి: భాను



భానుప్రకాష్‌కు గజపూలమాలతో స్వాగతం

పుత్తూరు అర్బన్, మార్చి 10: నగరిలో అభివృద్ధి మొత్తం శిలాఫలకాలకే పరిమితమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఎద్దేవా చేశారు. ఆదివారం పుత్తూరు పట్టణంలోని ఏఎంసీ కళ్యాణ మండపంలో విజయ సంకల్ప సమావేశం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ రెండుసార్లు డ్రామాలు చేసి గెలిచిన రోజాను ఈసారి నియోజకవర్గ ప్రజలు ఛీకొట్టడం ఖాయమన్నారు. మంత్రి స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన రోజా అయినదానికి కానిదానికి శిలాఫలకాలు వేసుకుంటూ, ఫోటో వేసుకుని మురిసిపోతోందని దుయ్యబట్టారు. ఒక్కటైనా చెప్పుకోదగ్గ అభివృద్ధి పని చేసిందా అని నిలదీశారు. మంత్రి రోజాను సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే ఛీదరించుకుంటున్నారని, ఆమె నియోజకవర్గ ప్రజలు తరిమికొట్టేరోజు దగ్గరలోనే ఉందన్నారు. వైసీపీ విషపు కోరల నుంచి నియోజకవర్గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వాఖ్యానించారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలన మొత్తం అవినీతి, దౌర్జన్యాలు, ప్రకృతి వనరుల దోపిడీతోనే గడిచిపోయిందని ఆరోపించారు. ఒక్కచాన్స్ పేరుతో గద్దెనెక్కిన జగన్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని లూటీ చేశారని మండిపడ్డారు. భావితరాల భవిష్యత్తును కాపాడుకోవాలంటే వైసీపీని బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని, నగరి నుంచి టీడీపీ అఖండ మెజార్టీతో గెలవనుందని జోస్యం చెప్పారు. అంతకు మునుపు పట్టణంలోని ఆరేటమ్మ ఆలయం నుంచి భానుప్రకాష్ సారధ్యంలో టీడీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ గాలి భానుప్రకాష్ కేఎస్ రోడ్డు సర్కిల్ చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేశారు. అక్కడి నుంచి కాలినడకన ఏఎంసీ కల్యాణమండపం చేరుకోగా కేహెచ్ఆర్ సంస్థ యజమాని కోలా సుధాకర్, శివాలయం మాజీ చైర్మన్ జలకం సునీల్‌కుమార్ క్రేన్‌తో గజపూల మాల వేసి స్వాగతం పలికారు. అనంతరం వారిరువురుతో పాటు సుమారు వంద మంది టీడీపీ తీర్థం పుచ్చుకోగా వారికి భాను ప్రకాష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే పైడిపల్లి, తొరూరు దళితవాడకు చెందిన సుమారు 40మందిటీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన శివాలయం మాజీ చైర్మన్ జలకం సునీల్ మాట్లాడుతూ ఆలయ కోనేరు విషయంలో జరుగుతున్న అక్రమాలను సహించలేకే వైసీపీని వీడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని కల్యాణపురం వద్ద టీడీపీ కార్యాలయాన్ని భానుప్రకాష్ శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ఎన్ఎన్ ధనపాల్, మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు యుగంధర్, కరుణాకరణ్, మాజీ వైస్ చైర్మన్లు డీఎస్ గణేష్, ఆనంగి ఆనంద్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు, కౌన్సిలర్లు రాధా అశోక్, కేశవచ్చారి, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, ఎస్‌బీఆర్ పురం సర్పంచ్ మణిరాజు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరిని 'గాలి'కొదిలేశారా?

● అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తేల్చని వైసీపీ

● మంత్రి రోజాకు టికెట్ ఇస్తున్నట్టా లేనట్టా?

పుత్తూరు అర్బన్, మార్చి 10: మంత్రి ఆర్‌కె రోజా ప్రాతినిధ్యం వహిస్తున్న నగరి నియోజకవర్గం వైసీపీ కేడర్‌లో రోజురోజుకీ గందరగోళం పెరుగుతోంది. వైసీపీ అభ్యర్థి రోజానే అని ఇప్పటికీ పార్టీ నిర్ధారించలేదు. అలాగని వేరే పేర్లనూ ప్రచారంలోకి తీసుకురాలేదు. ఆది నుంచీ రెండు వర్గాలుగానే ఇక్కడ వైసీపీ సాగుతోంది. కలుపుకుపోవడంలో రోజా విఫలమయ్యారు. పెద్దల అండదండలతో అసంతృప్త వర్గమూ తగ్గడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో పార్టీ అధిష్ఠానం విఫలమైంది. మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ జనంలో దూసుకుపోతున్నారు. ఈ పరిణామాలను చూసిన వైసీపీ అభిమానులు నియోజకవర్గాన్ని అధిష్ఠానం ఎటూ తేల్చకుండా గాలి భానుప్రకాష్‌కి అప్పగించేసినట్లుగా ఉందని చెప్పుకుంటున్నారు. రోజా నోటి దురుసుతనం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని పార్టీ గుర్తించినట్లు చెబుతున్నారు. సర్వేల్లోనూ అనుకూలత కనిపించకపోవడంతో ఇప్పటిదాకా నగరి స్థానాన్ని మాత్రం ప్రకటించలేదు. రోజాకే తిరిగి టికెట్ ఇస్తే అటు టీడీపీతోనూ, ఇటు సొంత పార్టీలోని అసమ్మతితోనూ ఆమె పోరాడాల్సి వస్తుందన్నది అధిష్ఠానాన్ని కలవరపెడుతున్నట్టు చెబుతున్నారు. ఒకవేళ టికెట్ ఇవ్వకపోతే ఈ ఫైర్‌బ్రాండ్ ఎలా పేలుతుందో అనే ఆందోళన కూడా వారిలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

కొరకరాని కొయ్యలా అసమ్మతి..

2019 ఎన్నికల్లో నగరి నుంచి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మంత్రి రోజా కుటుంబం పెత్తనం పెరగడంతో నియోజకవర్గంలో వ్యతిరేకత పెరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు అగ్నికి ఆజ్యం పోశాయి. పుత్తూరు మున్సిపాలిటీలో రెండుసార్లు ఫ్లోర్ లీడర్‌గా, మాజీ ఎంపీపీగా, మాజీ సర్పంచ్‌గా పనిచేసిన ఏలుమలై మొదలియార్ కి, నగరి మున్సిపాలిటీలో మాజీ చైర్మన్లు కేజే కుమార్ దంపతులకు కనీసం బీఫాం కూడా కేటాయించకపోవడంతో వారు ఎదురుతిరిగారు. నిండ్ర ఎంపీపీగా రెడ్డివారి భాస్కర్‌రెడ్డికి, విజయపురం ఎంపీపీగా లక్ష్మీపతిరాజుకు చివరి నిమషంలో హ్యాండ్ ఇవ్వడంతో ఆ రెండు మండలాల్లో కూడా అసమ్మతిని రాజేసింది. మండలంపై మంత్రి రోజా అన్నల పెత్తనాన్ని వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి తీవ్రంగా ప్రతిఘటించారు. ఇటీవల ఆయన బహిరంగంగానే తాడోపేడోకు సిద్ధమవగా, మిగిలిన నాయకులు కూడా ఆయనకు మద్దతుగా రంగంలోకి దిగారు. మీడియా సమావేశాలు నిర్వహించి మంత్రి రోజాతో సయోధ్య ప్రసక్తే లేదని పరోక్షంగా తేల్చేశారు. జిల్లా వైసీపీకి పెద్దదిక్కుగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డి నాలుగేళ్ల నుంచి రగులుతున్న నగరి నియోజకవర్గంలోని అసమ్మతి గాడిన పెట్టకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పనిసరిగా మాస్క్‌లు వాడండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

పుత్తూరు టౌన్, మార్చి 10: దుకాణాల్లో, ఇళ్లలో దుమ్ము, దూళి శుభ్రం చేసే సమయంలో మాస్క్‌లు తప్పనిసరిగా వాడాలని ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు డాక్టర్ ఎం.పీ. నరసింహ సూచించారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయుష్ ద్వారా గుర్తింపుపొందిన వెల్‌నెస్ ఉత్పత్తుల గురించి విశ్వనాధ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిరాజు, 302 గవర్నర్ మాధవ నాయుడు, అధ్యక్షుడు కేఎల్ఎన్.మూర్తి, కార్యదర్శి మునికృష్ణయ్య, కోశాధికారి గుణశేఖర్ రెడ్డి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

అధికార నందిపై ఆదిదేవుడి చిద్విలాసం

శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ముక్కంటీశుడు అధికార నందిపై, జ్ఞాన ప్రసూనాంబదేవి కామధేనువుపై భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార మండపంలో ఉత్సవర్లకు హారతులు సమర్పించాక రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వాహనాల మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వాహనాలపై కొలువుదీర్చాక పురవీధుల్లో ఊరేగింపు ప్రారంభమైంది. స్వామి, అమ్మవార్లకు ముందు వరుసలో శివ పరివారం సాగింది. కళాకారుల ప్రదర్శనలు, కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

నేడు సభాపతి కల్యాణం

సోమవారం రాత్రి సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతిగా పిలువబడే నటరాజస్వామికి శివకామ సుందరితో కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణం ఆలయ ప్రాంగణంలోని 16కాళ్ల మండపం వద్ద జరుగుతుంది. ఇక సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు.



అధికార నంది, కామధేను వాహనాలపై శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవి

బ్రహ్మోత్సవాల్లో నేడు..

సభాపతి కళ్యాణం, ఆనందరాత్రి (పాల్గున శుద్ధ పాడ్యమి, సోమవారం)

ఉభయదారులు

అరుణాచలం, తిరువణ్ణామలై గ్రామస్తులు

వాహనసేవలు..

ఉదయం 11 రుద్రాక్ష అంబారీ వాహనసేవ

రాత్రి 7 గంటలకు ఆలయంలో సభాపతి కళ్యాణం

నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం 9 నవ దంపతులుగా స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రవేశం (గోవత్స దర్శనం)
- ఉదయం 9 నుంచి 10 గంటల వరకు మూడు కాలల అభిషేకం
- ఉదయం 12 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- సాయంత్రం 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 7 గంటలకు సభాపతి కళ్యాణం, పురవీధుల ఉత్సవం
- రాత్రి 9:30 దర్శనం ముగింపు
- ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు రాహుకేతు సర్వదోష నివారణ పూజలు

నిత్యాన్నదానానికి విరాళాలు



శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి భక్తులు విరాళాలు సమర్పించారు. మామిడిపల్లికి చెందిన పద్మలత, విజయ్‌కుమార్ దంపతులు రూ.లక్ష, తొట్టంబేడుకు చెందిన ప్రమీల , శ్రీనివాసరావు దంపతులు రూ.లక్ష నగదును విరాళంగా సమర్పించారు. పరిపాలనా భవనంలో ఆదివారం ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు దర్శనం ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి, మార్చి 10: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆది దంపతుల కల్యాణానికి టీటీడీ తరఫున ఆదివారం ఈవో ధర్మారెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. అలంకార మండపంలో ఈ పట్టు వస్త్రాలను అర్చకులకు అందజేశారు. కాగా అంతకు ముందు కాణిపాకం, శ్రీశైలం ఆలయాల నుంచి ముక్కంటి ఆలయానికి శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పూర్వ ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంకమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక మరాఠీపాళెం వాసులు మాఘ అమావాస్య పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్‌రావు, బాలాజీరావు, సత్యనారాయణరావు, రావు, జయగణేష్ పాల్గొన్నారు.

దానగుణమే దైవత్వం

శ్రీకాళహస్తి, మార్చి 10: దానగుణమే దైవత్వమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శివపార్వతుల కల్యాణం పురస్కరించుకొని ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వధూవరులకు బంగారు తాళిబొట్లు వితరణ చేశారు. బియ్యపు కృష్ణారెడ్డి మండపంలో శివపార్వతుల కల్యాణం పురస్కరించుకుని వధూవరులకు తాళిబొట్లు, ఉపకరణాలు వితరణ చేశారు.

ఉమామహేశ్వరుడి సేవలో హెలెన్

వరదయ్యపాళెం, మార్చి 10: వరదయ్యపాళెం మండలం వెంకటరెడ్డికండ్రిగలో స్వయంభువుగా వెలసిన ఉమా మహేశ్వరస్వామిని ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ దర్శించుకున్నారు. ఆమెవెంట టీడీపీ నాయకులు పరుచూరి మల్లికార్జుననాయుడు, నాగరాజు యాదవ్, నిర్మల్‌కుమార్, గోవిందు చౌదరి, కొండూరు బాలరాజు, శ్రీనునాయుడు, అజయ్, అభి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవకులకు తప్పని తిప్పలు

శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉచిత సేవకులకు తిప్పలు తప్పడం లేదు. ప్రతి సంవత్సరం ఎందరో భక్తులు ఉచిత సేవలు చేసేందుకు ముక్కంటి ఆలయానికి వస్తుంటారు. వారికి అవసరమైన కనీస సౌకర్యాలపై ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆలయానికి దూరంగా భరద్వాజ తీర్థంలో ఉన్న గంగాసదన్‌లో వారికి బస కల్పించారు. గది నుంచి ఆలయం వద్దకు చేరుకోవడానికి వారు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఉచిత బస్సులు అందుబాటులో ఉన్నా ఆ సౌకర్యం వారికి కల్పించడం లేదు. దీంతో వారు గంగాసదన్ నుంచి రాకపోకలు సాగించేందుకు ఎండలో ప్రయాసలు పడుతున్నారు.



భరద్వాజ తీర్థం రోడ్డులో నడిచి వెళుతున్న శ్రీపాద సేవకులు

ప్రసన్న వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 10: అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని కారణి, బీఎస్‌కండ్రిగ గ్రామాలలోని వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు.

ముక్కంటీశుడికి నృత్యార్చన

తొట్టంబేడు, మార్చి 10: భోళాశంకరుడైన ఆ పరమశివుడు అద్వంత రహితుడని సహస్రావధాని పల్లెర్ల రామోహన్‌రావు అన్నారు. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళాప్రాంగణంలో స్వరలహరి కల్చరల్ అకాడమీ, మహబూబ్‌నగర్ పల్లెర్ల రామోహన్‌రావు శ్రీకాళహస్తీశ్వర వైభవం ప్రవచనం ఆహూతులను భక్తిపారవశ్యంతో ముంచెత్తింది. మేరు పర్వతాన్ని సూర్య చంద్రులు, నవగ్రహాలు ప్రదక్షిణ చేస్తుంటాయని అయితే రాహుకేతువుల క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శనం చేసుకొంటే, మేరు పర్వతాన్ని ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలమన్నారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకోవడంతోనే సర్వపాపాలు తొలగిపోతాయని తెలిపారు. ముందుగా నారాయణపేట జిల్లా, ముక్తల్, తెలంగాణ శ్రీమతి హారతి గోపాలాచారి జోషి వారిచే నృత్య ప్రదర్శన, ఆద్య నృత్యాలయ బృందం కూచిపూడి నృత్యం, నాట్యక్రియ అకాడమీ భవాని విజయ్, నిజాంబాద్ వారి నృత్యప్రదర్శలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు దేవస్థానం అధికారులు దుశ్శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



పల్లెర్ల రామోహన్‌రావు ప్రవచనాలు, ఆద్యనృత్యాలయ బృందం కూచిపూడి, భవాని విజయ్ భరతనాట్యం, శ్రీమతి హారతి గోపాలాచారిజోషి నృత్యప్రదర్శన

ఎనిమిది టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

శ్రీకాళహస్తి, మార్చి 10: అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 8 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని కొత్త బైపాస్ రోడ్డు సమీపంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తిరుపతి విజిలెన్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రేషన్ బియ్యం స్థావరంపై దాడి చేసి 8 టన్నులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి

రేణిగుంట, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయం వద్ద మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎస్.రాజేశ్వరి, లక్ష్మి, సత్యశ్రీ, ఈశ్వ రమ్మ, దీప, మునిరాజమ్మ, రైల్వే క్లీనింగ్ వర్కర్స్ నాయకులు మునిలక్ష్మి, అమ్ములు, సంఘమిత్ర నాయకురాలు సునీలా పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అనాగరికం



శ్రీకాళహస్తి, మార్చి 10: బాల్యవివాహాలు అనాగరిక చర్య అని అభ్యుదయ వేదిక సభ్యులు తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఆదివారం బాల్యవివాహాల నిర్మూలనపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా బాల్య వివాహాలు జరిపించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షులు గురవయ్య, నాయకులు రామచంద్రయ్య పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డికి ఒక అవకాశం ఇవ్వండి

తొట్టంబేడు, మార్చి 10: బొజ్జల సుధీర్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి రిషితారెడ్డి, సోదరి పద్మ కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు, పెనుబాక గ్రామాలలో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, నాయకులు శ్రీనివాసులు నాయుడు, రమేష్‌నాయుడు, బలరాంనాయుడు, చిరంజీవి, చంద్రబాబు నాయుడు, సతీష్‌నాయుడు, జయ, అశోక్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తొట్టంబేడు, మార్చి 10: పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కో-కన్వీనర్ మేళా గారం సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోలా ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు క్రిష్ణయ్య, రవిఆచ్చారి, మునిరాజ, రవిచంద్ర, బిందుకుమార్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీణాపాణిగా వేంకటేశ్వరస్వామి దర్శనం

తొట్టంబేడు, మార్చి 10: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురం గ్రామంలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారం హంస వాహనంపై వీణాపాణిగా భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీణాపాణి అవతారంలో స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. టీటీడీ అధికారులు డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఆలయ పర్యవేక్షకులు రవికుమార్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



హంసవాహనంపై ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి





మృతి చెందిన వీరాస్వామి, తీవ్రంగా గాయపడిన బాలాజీ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 10: మండలంలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డుపై ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వరదయ్యపాళెం మండలం కడూరు గ్రామానికి చెందిన వీరాస్వామి(70) ఎన్టీఆర్ నగర్ దగ్గర రోడ్డుపై నడిచి వెళు తున్నాడు. అదే సమయంలో శ్రీసిటీలో పనిచేస్తున్న బీఎస్‌కండ్రిగ గ్రామానికి చెందిన బాలాజీ విధులకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. అదుపుతప్పి వీరాస్వామిని ఢీకొని కిందపడిపోయాడు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వీరాస్వామి మృతిచెందారు. మెరుగైన వైద్యం కోసం బాలాజీని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సత్యవేడు, మార్చి 10: మండలంలోని వీఆర్ కండ్రిగ అరుంధతివాడలో లిటరసీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎల్ఏఆర్డీఎస్) అధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో సమీప గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. చెన్నై అంజికరైకు చెందిన డాక్టర్ అర్జున్ థామస్, భాస్కరన్, సంపత్, రాబర్ట్, వైద్య బృందం పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జయకుమార్, రేఖ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఎదురేలేదు



విజయబాబును సన్మానిస్తున్న పిచ్చాటూరు టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, మార్చి 10: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎదురు లేదని విజయం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని వేలూరులో ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. టీడీపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు ఆధ్వర్యంలో పలువురు అయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసమే మూడు పార్టీలు కలిశాయని వివరించారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేయడం, చట్టసభల్లో బూతుల సంస్కృతి తీసుకురావడం, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడం తదితర చర్యలతో వైసీపీ సమాజంలో విద్వేషం నింపిందని పేర్కొన్నారు. ఈ అరాచకాలు పోవాలంటే వైసీపీని ఇంటికి సాగనంపాలని తెలియజేశారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కాగానే రాష్ట్ర ప్రగతికి మళ్లీ బాటలు వేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సీనియర్ నాయకుడు ప్రభాకర్ నాయుడు, వెంకటరత్నంనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటు వేయండి



మిద్దికండ్రిగలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, మార్చి10: రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ హెలెన్ కోరారు. మండలంలోని మిద్దికండ్రిగ పంచాయతీలో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మునిస్వామి యాదవ్, లోకేష్ చౌదరి, సర్పంచులు దొరబాబునాయుడు, సురేష్, వెంకటేష్, పాల ఏకిరి సంఘం అధ్యక్షులు వెంకట కృష్ణయ్య, బూత్ ఇన్‌చార్జిలు శ్రీనివాసులు, గోపి, దొరస్వామి, వరలక్ష్మి యాదవ్, మునిలక్ష్మి, పురుషోత్తం, అయ్యప్ప, ప్రభాకర్, భాస్కర్, హరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



నాగలాపురం, మార్చి 10: రాబోవు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించు కోవడానికి కేంద్ర బలగాలు, పోలీసులు భరోసానిస్తూ నాగలాపురం మండలంలో ఆదివారం సంయుక్త కవాతు నిర్వహించారు. సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈబీసీ కాలనీలో తీరిన తాగునీటి సమస్య



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 10: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందరమ్మల చొరవతో చేతి పంపు మరమ్మతు చేయించి తాగునీటి సమస్యను తీర్చారు.

బీజేపీ నాయకుడికి సన్మానం



వరదయ్యపాళెం, మార్చి 10: వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్ పల్లికి చెందిన వ్యాపారవేత్త డాక్టర్ కేబీ గురుదేవ్, విజయలక్ష్మి దంపతులను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తమిళనాడులోని రాయపురం జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా గురుదేవ్ నియమితులైన సందర్భంగా ఈ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సిద్ధులయ్య, జిల్లా యువమోర్చ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ ప్రకాష్, మండల అధ్యక్షులు పురుషోత్తం, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, సుబ్రహ్మణ్యం, జయంత్, కుమార్, యేసు, సూర్యయ, విక్కీ, శివ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

ఏర్పేడు, మార్చి 10: శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే బాల్యవివాహాలను నిర్మూలించాలని ప్రగతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కోరారు. బాల్య వివాహాల నిర్మూలనపై ఆదివారం ఏర్పేడు మండలంలోని బండారుపల్లి, వెంకటపాళెం, చింతపాళెం, పోతుమానుగుంట, పల్లం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి మండల కో-ఆర్డినేటర్ శిరీష, ఉపాధ్యాయులు, ఎస్‌సీపీ మెంబర్లు, సీబీవో మెంబర్లు, వార్డు మెంబర్లు, అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది, ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పల్లికొండేశ్వరుడి త్రిశూల స్నానం

- రావణ బ్రహ్మ వాహనంపై ముక్కంటీశ్వరుడు
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నాగలాపురం, మార్చి 10: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన ఆదివారం త్రిశూల స్నాన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం 5గంటల ప్రాంతంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ యాగశాల మండపంలో శాస్త్రోక్తంగా యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రదోష మండపంలో శివగామి సమేత నటరాజస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనం, పన్నీరు మొదలగు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి దీప, దూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో త్రిశూలం, చక్రత్తాళ్వార్లకు వేదమంత్రాల నడుమ అభిషేకాలు చేసి ఆలయంలో స్థానికంగా ఏర్పాటు చేసిన నీటిలో అర్చకులు అధికారులు త్రిశూలం, చక్రత్తాళ్వార్లతో ముమ్మార్లు మునిగి త్రిశూల స్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఆలయ ధ్వజ స్తంభం వద్ద ధ్వజా అవరోహణ కార్యక్రమంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పరిసమాప్తి చేశారు.



త్రిశూలానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

రావణబ్రహ్మ వాహనంపై శివయ్య కటాక్షం

రాత్రి సర్వమంగళాదేవి సమేత వాల్మీకేశ్వర స్వామి వార్ల ఉత్సవర్లకు అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి రావణ బ్రహ్మ వాహనంపై అధిష్టింపజేశారు. మహా హారతి, నక్షత్ర హారతి, కుంభ హారతులు చేపట్టారు. మంగళవాయిద్యాలు, భజన బృందాలు, కోలాటాలు, బాణ సంచా పేలుళ్ల నడుమ తిరువీధి ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఈ పూజలకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజలను ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.





రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవార్లు ● ప్రత్యేక అలంకరణలో శివగామి సమేత నటరాజస్వామి